సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 26 । జనవరి । 2023



పోలీస్ మెడల్‌కు సీఐ సాదిక్‌అలీ ఎంపిక

ములకలచెరువు సీఐ సాదిక్‌అలీ పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యా రు. రాష్ట్ర ప్రభుత్వం 15 మంది పోలీసు అధికారుల జాబితాను భారత ప్రభుత్వానికి పంపింది. రాష్ట్ర పోలీస్‌శాఖలో ఉత్తమ సేవలు, ప్రతి భావంతులకు ప్రతి ఏటా పోలీస్‌మెడల్స్‌ను భారత ప్రభుత్వం ప్రదానం చేస్తుంది. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లా నుంచి సాదిక్‌అలీ ఎంపికయ్యారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జాబితాను బుధవారం ప్రకటించింది. సీఐ సాదిక్ అలీ పోలీస్‌మెడల్‌కు ఎంపిక కావడంపై స్థానిక పోలీసులు, నాయకులు అభినందనలు తెలిపారు. -ములకలచెరువు

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.200
రెండోరకం	రూ.90	రూ.158



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 175 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	715	717
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 273.90 కిలోలు

న్యూస్‌రీల్

ఎన్‌ఎంఎంఎస్ హాల్ టిక్కెట్లు వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు

రాయచోటి టౌన్ : 2022–2023 సంవత్సరానికి గానూ జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) ఫిబ్రవరి 5వ తేది ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా డీఈవో రాఘవరెడ్డి ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్ సైట్ ద్వారా పొందవచ్చునన్నారు. అందు కోసం www.bse.ap.gov.in లాగిన్ ద్వారా పొందవచ్చని తెలియ చేశారు. సంబంధిత ప్రధానోపాధ్యాయులు పాఠశాల యు–డైస్ కోడ్‌ను ఉపయోగించి హాల్ టిక్కెట్లు పొందవచ్చని సూచించారు.

వైఎస్సార్‌సీపీ నుంచి రజని సస్పెన్షన్

కడప కార్పొరేషన్: రాష్ట్ర బొందిలి కార్పొరేషన్ డైరెక్టర్ రసపుత్ర రజనిని సస్పెండ్ చేసినట్లు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీ నియమావళిని ఉల్లంఘించినందున, ఆమె వ్యవహార శైలి సక్రమంగా లేనందున పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు.

చౌకబారు విమర్శలు చేయడం తగదు : ఎమ్మెల్యే రాచమల్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : రాజకీయాల్లో ఉన్నపుడు హుందాగా ఉండాలని, చౌకబారు విమర్శలు తగదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రొద్దుటూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ నాయకులతో ఎంతో మంది ఫొటోలు తీసుకుంటూ ఉంటారని, అంత మాత్రాన వారి వ్యవహారంలో నాయకులకు సంబంధం ఉందని బురద చల్లడం సరికాదన్నారు. అలా అయితే బ్రీఫ్‌డ్ మీ కేసులో చంద్రబాబు, ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డి పరిస్థితి ఏమిటని ఎమ్మెల్యే ప్రశ్నించారు. జోడో యాత్ర చేస్తున్న రాహుల్ గాంధీతో దారివెంబడి ఎంతో మంది ఫొటోలు తీసుకుంటూ ఉంటారని, అంత మాత్రన వారితో రాహుల్ గాం. దీకి సంబంధం ఉందంటే ఎలా అన్నారు.

ముువ్వన్నెల జెండా రెపరెపలు

102 అడుగుల స్తంభంపై ఏర్పాటు చేసిన జాతీయ జెండా

రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రం కలెక్టరేట్ ముఖద్వారం వద్ద 102 అడుగుల స్తంభంపై ఏర్పాటు చేసిన జాతీయ జెండా జిల్లాకే తలమానికంగా నిలుస్తుందని కలెక్టర్ గిరీషా పీఎస్, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, జేసీ తమీమ్ అన్సారియాలు తెలిపారు. బుధవారం 102 అడుగుల స్తంభంపై ఏర్పాటు చేసిన జాతీయ జెండాను సంయుక్తంగా వారు ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లాలో అత్యంత పెద్ద జాతీయ పతాకం, ఎత్తయిన స్థూపం ఇదే కావడం గమనార్హం అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, మున్సిపల్ కమిషనర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



102 అడుగుల స్తంభంపై ఏర్పాటు చేసిన జాతీయ జెండా



గణతంత్ర దినోత్సవం సందర్భంగా వెలుగులతో మెరిసిపోతున్న అన్నమయ్య జిల్లా కలెక్టరేట్

గణతంత్ర వేడుకలకు అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని కలెక్టర్ కార్యాలయం ముస్తాబు అయింది. సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. విద్యుత్ దీప కాంతులతో మిరుమిట్లు గొలుపుతోంది. - రాయచోటి

ప్రజాస్వామ్యం మనుగడకు

ఓటుహక్కే ఆధారం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్

జాతీయ ఓటర్ల దినోత్సవంలో కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి అర్బన్ : ప్రజాస్వామ్యం మనుగడకు ఓటుహక్కు ప్రధాన ఆధారమని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి గిరీషా పీఎస్ అన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. పట్టణంలోని బంగ్లా నుండి ర్యాలీ సాయిశుభ కళ్యాణ మండపం వరకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, అధికారులు విద్యార్థులు, ఓటర్లచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉన్న ఒకే ఒక్క ఆయుధం ఓటుహక్కు అన్నారు. వజ్రాయుధం లాంటి ఓటుహక్కును అర్హులైన ప్రతిఒక్కరూ తప్పని సరిగా నమోదు చేసుకోవాలి, వినియోగించు కుని తీరాలంటూ చెప్పారు. ఆర్డీఓ రంగ స్వామి మాట్లాడారు. అనంతరం నూతనంగా ఓటునమోదు చేసుకున్నవారికి కలెక్టర్ ఎపిక్ కార్డులను అందచేశారు. అనంతరం సీనియర్ సిటిజన్‌లను సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ రాంబాబు, ఆర్‌ఐ మల్లికార్జున, తహసీల్దార్ రవిశంకర్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్రనేత శ్రీనివాసరాజు, మున్సిపల్, రెవెన్యూ, సచివాలయం అధికారులతో పాటు , కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలను సద్వినియోగం చేసుకోవాలి

రాయచోటి టౌన్ : గ్రామీణ క్రీడలను గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గిరీషా పీఎస్ విద్యార్థులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కబడ్డీ ప్రోగ్రాం ఆర్గనైజర్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో కబడ్డీ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కబడ్డీ క్రీడలు రాయచోటి పట్టణంలో ఉన్న ఐకే ఒలంపియాడ్ స్కూల్ ఆవరణలో ఈనెల 30న బాలురకు, 31న బాలికలకు నిర్వహిస్తామని నిర్వాహకులు వినయ్‌కుమార్ తెలిపారు. ఎంట్రీ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని.. పోటీలలో పాల్గొనే విద్యార్థులు 62814 53550 నంబర్‌కు ఫోన్ చేసి రిజిష్టర్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్రక్రమశిక్షణ సంఘం కన్వీనర్ కె. శ్రీనివాస రాజు, అర్చనా విద్యాసంస్థల కరస్పాండెంట్ మదన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్పవృక్ష వాహనంపై ఊరేగుతున్న శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి



రామ సేవలో హనుమ

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి ఉదయం కల్ప వృక్ష వాహనంపై విష్ణుమూర్తిగా కొలువుదీరి మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం హనుమంత వాహనంపై కోదండరాముడిగా కొలువుదీరాడు. వేద పండితులు స్వామి అమ్మవార్ల మూల విరాట్లకు విశేష అలంకారం చేశారు. అమ్మవారి సన్నిధిలో గానం, సంగీతం నివేదిస్తూ ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం ఆలయం వెలుపలగల అలంకార మండపంలో స్వామిని వాహనంపై ఆసీనులను చేశారు. సూర్యతేజోమయుడైన శ్రీ రామచంద్రుడు ధగధగలాడే రంగురంగుల విద్యుద్దీపాల వెలుగులో మరింతగా మెరిసిపోతూ భక్తులను కరుణించాడు. మాడ వీధుల్లోని భక్తులు పూజా ద్రవ్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పాతకడప, దేవునికడపలతోపాటు నగరానికి చెందిన భక్తులు స్వామి వెంట ఊరేగింపులో పాల్గొన్నారు. చెక్కభజన, కోలాటం కళాకారులు ఊరేగింపులో ముందుగా వెళుతూ స్వామి రాకను తెలియజెప్పారు.



హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న కడప రాయుడు

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



చిట్వేలి: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



వీరబల్లి: ర్యాలీ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



చిన్నమండెం: వృద్ధుడిని సన్మానిస్తున్న అధికారులు

రాజంపేట రూరల్ : ఓటుహక్కును కలిగి ఉండటం ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని సబ్ కలెక్టర్ అహ్మద్ ఖాన్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాతబస్టాండ్‌లోని వైఎస్సార్ సర్కిల్ వద్ద మానవ హారం నిర్వహించారు. ఈ మానవహారంలో ఓటు హక్కు యొక్క విలువను వివరించారు. అనంతరం ఏఓ శిరీషా ఆధ్వర్యంలో స్థానిక బాలికోన్నత పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా వృద్ధ ఓటర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

వీరబల్లిలో..

వీరబల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల నుంచి వీరబల్లి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారంగా నిలిచారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ..

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలో పాలకొండ్రాయ స్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ మందల ప్రవీణ్ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఓటును వజ్రాయుధంగా ఉపయోగించుకోవాలని కరస్పాండెంట్ సూచించారు.

రామాపురంలో..

రామాపురం : ప్రపంచ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని 13 గ్రామపంచాయతీల పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాలీ నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు, సీనియర్ ఓటర్లను గుర్తించి వారికి సన్మానాలు జరిపారు. అనంతరం కొత్తగా ఓటరు నమోదు కోసం ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో బూత్ లెవల్ అధికారులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సీనియర్ ఓటర్లకు సన్మానం

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామం హరిజనవాడ ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను తహసీల్దార్ శ్రీరాములునాయక్ సన్మానించారు. అనంతరం ఓటు ప్రాధాన్యతను వివరించారు.

ఓటు ప్రజాస్వామ్యానికి జీవనాడి

సంబేపల్లె : మండలంలోని నాగిరెడ్డిగారిపల్లెలో బుధవారం సీనియర్ ఓటర్లను మండల వైఎస్ఆర్‌సీపీ కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటర్‌గా నమోదు చేసుకోవాలని సూచించారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : ప్రపంచ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ రామ్మోహన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, రాజ్యాంగం ఓటు హక్కు కల్పించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధం

చిట్వేలి : ప్రజాస్వామ్యంలో ఓటుహకుక వజ్రాయుధమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ మురళీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ మహేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి అధ్యక్షతన 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఓటు ప్రాముఖ్యతను వివరించారు.

ప్రభుత్వ ఆస్తులు కార్పొరేట్లకు ధారాదత్తం

రాయచోటి అర్బన్: దేశంలో వేలకోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు కారుచౌకగా ధారాదత్తం చేస్తోందని ఏఐటీయూసీ రాష్ట్రకార్యదర్శి రాజారెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్‌లు విమర్శించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఐ - ఏఐటీయూసీల ఆధ్వర్యంలో విశాఖ ఉక్కుఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల బలిదానాలు, రైతుల త్యాగాలు, ప్రజాప్రతినిధుల రాజీనామాలుతో ఏర్పాటైన విశాఖ ఉక్కుఫ్యాక్టరీని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు అమ్మకానికి పెట్టడం దారుణమన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఈనెల 30వ తేదీన విశాఖపట్నంలో లక్షమంది కార్మికులతో గర్జనను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్మిక గర్జనకు ప్రజాస్వామికవాదులు,కార్మికులు, యువత పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ది గాళ్ళ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సాంబశివ, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కృష్ణప్ప, రైతుసంఘం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్ళు నాగేశ్వరి, సరోజమ్మ, సీపీఐ నేతలు మురళి, వెంకటేశు తదితరులున్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

లక్కిరెడ్డిపల్లి : మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు వడ్డించాలని జీసీడీఓ రాధా పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లెలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టండి

సిద్దవటం : పోలీసుస్టేషన్‌లో నమోదైన రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని వైఎస్ఆర్ కడప జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఎస్ఐకి సూచించారు. సిద్దవటం పోలీసు స్టేషన్‌ను ఎస్పీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులతోపాటు పోలీసుస్టేషన్ పరిసర ప్రాంతాలను, పోలీసు క్వార్టర్స్‌ను పరిశీలించారు. పలు కేసులలో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను వేలం వేయించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తులసీ నాగప్రసాద్, రైటర్ చంద్రశేఖర్‌రాజు, కంప్యూటర్ ఆపరేటర్ నాగరాజు, పోలీసులు పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి అంబేడ్కర్

రాయచోటి : భారత జాతిని జాగృతపరిచిన ఆదర్శమూర్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లుతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. అంబేడ్కర్ భావిభారతాన్ని ప్రభావితం చేస్తున్న మహోన్నత శక్తి అని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పెనగలూరు: జగనన్న ఇళ్లను లబ్ధిదారులు త్వరితగతిన నిర్మించాలని మండల వైస్ ఎంపీపీ కొండూరు విజయ్‌రెడ్డి తెలిపారు.

యువత లక్ష్యసాధనకు కష్టపడాలి

రాజంపేట రూరల్: విద్యార్థులు లక్ష్యసాధనకు కష్టపడాలని, పక్కా ప్రణాళికతో చదవాలని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీ షిరిడీసాయి జూనియర్ కళాశాల, శ్రీచక్ర హైస్కూల్‌ల వార్షికోత్సవాన్ని కరస్పాండెంట్ పోలా వెంకటరమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డిల ఆధ్వర్యంలో కాకతీయ విద్యా సంస్థల ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి, ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చొప్పా ఎల్లారెడ్డి విచ్చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్ విద్యను గ్రామస్థాయిలో అందిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ శ్రద్ధగా చదువుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పోటీ పరీక్షలు, క్రీడాపోటీలు నిర్వహించి విజయం సాధించిన వారికి బహుమతులు అందజేశారు.విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మేనేజింగ్ డైరెక్టర్ పోలా సాయి వైభవ్ రెడ్డి, శ్రీ చక్ర స్కూల్ కరస్పాండెంట్ రాఘవరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామయ్య సేవలో రాష్ట్ర శాప్ చైర్మన్

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలోని సీతారామలక్ష్మణ మూర్తులను బుధవారం రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు ఆలయ లాంచానాలతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగమండపంలో ఆయనను సత్కరించారు. తీర్థప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ఇరగంరెడ్డి శ్రీకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రవాల్మీకి జయంతి

ఒంటిమిట్ట: శ్రీ కోదండ రామాలయం సమీపంలో శృంగిశైలంపై వెలసిన ఆంధ్రవాల్మీకి వావికొలను సుబ్బారావు 160 వ జయంతి వేడుకలు బుధవారం టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా కోదండ రామాలయ అర్చకులు వీణామనోజ్ కుమార్ స్వామి వారికి పూజలు నిర్వహించారు.

సుండుపల్లెలో బైరెడ్డి రోడ్ షో



సుండుపల్లె రోడ్ షోలో బైరెడ్డి సిద్ధారెడ్డి

సుండుపల్లె (వీరబల్లి) : సుండుపల్లెలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధారెడ్డి బుధవారం మండల కన్వీనర్ ఆనంద్ రెడ్డి ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా బైరెడ్డి సిద్ధారెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు అజయ్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ అజంతమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఆరంరెడ్డిలు బైరెడ్డి సిద్ధారెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి, అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, యర్రపురెడ్డి రవీంద్రారెడ్డిల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బైరెడ్డి సిద్దారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని, అందువలనే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నప్పుడు ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారని తెలియజేశారు. బడుగు, బలహీన వర్గాలకు సైతం పదవులు కల్పించిన ఘనత మన రాష్ట్ర ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు జగనన్న అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి ప్రచారం చేస్తానని ఈ సందర్భంగా బైరెడ్డి సిద్దారెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.